www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023
5
వైఎస్‌ఆర్

ఐసిఎల్ ఫ్యాక్టరీ కాలుష్యంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ఐసిఎల్ కర్మాగారం నుండి వెలువడు పొగ, దుమ్ము వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కర్మాగారంపై తగు చర్యలు తీసుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్ ఎరికల్‌రెడ్డి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారం నుండి పొగతో కూడిన నల్లటి సిమెంట్ కలిసిన దుమ్ము పరిసర ప్రాంత ఇళ్లల్లోకి వస్తోందన్నారు. దీనివల్ల 15,16,17 వార్డు ప్రజలు చర్మవ్యాధులు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని వివరించారు. పశువులు కూడా అస్వస్థతకు గురవుతున్నాయని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యాన్ని శుక్రవారం కలిసి సమస్యను వివరించినా, తూతూ మంత్రంగా వచ్చి వెళ్ళారే కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. డిటి రమణారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు.

పారిశ్రామిక రంగం పరుగులు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

కడపలో ఆల్ డిక్సన్, రాజీవ్ పార్కు, మార్గ్ శిలాఫలాల ఆవిష్కరణ

కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌లో ఆల్‌డిక్సన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్ కేంద్రంగా పారిశ్రామికరంగం పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మూడవ రోజు పర్యటనలో భాగంగా రూ.871 కోట్ల వ్యయంతో కూడిన పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీబిజీగా గడిపారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్‌లో ఆల్ డిక్సన్ యూనిట్‌ను ప్రారంభించారు. టెక్నోడోమ్, వర్చువల్ మేజ్ సంస్థలకు, శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుంచి వర్చువల్ మ్యాప్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అభివద్ధి చేస్తున్న "వర్చువల్ మేజ్ సాఫ్టీస్ ప్రైవేట్ లిమిటెడ్" వైఎస్ఆర్ జిల్లాకే తలమానికంగా అభివద్ధి చెందుతున్న కొప్పర్తిలోని వైఎస్ఆర్ఇఎంసిలో తమ ఉత్పత్తులను ప్రారంభించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఎలెక్ట్రిక్ వాహనాలకు వాడే బ్యాటరీలు, జిపిఎస్ ట్రాకర్, స్మార్ట్ పిసిబి వంటి అధునాతన డివైస్ పరికరాలను ఉత్పత్తి చేసే యూనిట్ స్థాపన రూ.71.10 కోట్ల పెట్టుబడితో 7.210 ఎకరాల్లో పర్యావరణ హితమైన యూనిట్ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 1,350 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు అభిస్తాయని తెలిపారు. అరబ్ దేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఎలిస్టా కంపెనీకి అనుబంధంగా అభివృద్ధి చెందుతున్న "టెక్నో డోమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" కన్సుమర్ ఎలక్ట్రానిక్ కంపెనీ వైఎస్ఆర్ఇఎంసిలో రూ.52 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తుల యూనిట్ ను ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. కొప్పర్తిలో రూ.100 కోట్ల పెట్టుబడితో ఆడియో సిస్టం భాగాలను ఉత్పత్తి చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, సిఎం ముఖ్యకార్యదర్శి ధనుం జయరెడ్డి, ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియాఖనమ్, ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, సుధ, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జెసి గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

కడప నగరంలో రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

డిమాండ్ల సాధన కోసం

అంగన్వాడీల ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట 36 గంటల నిరసన
- ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం కదం తొక్కారు. కేంద్ర ప్రభుత్వం ఐడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు 36 గంటల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోని వచ్చి తొమ్మిదిఏళ్లయినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఐసిడిఎస్ లక్ష్యాలకు విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. యూనియన్ నిర్వహించిన పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.1,500, ఆయాలకు రూ.750, మినీ కార్యకర్తలకు రూ.1,250 పెంచుతామని ప్రకటన చేశారని తెలిపారు. ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. 2017 నుంచి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని చెప్పారు. 2022, ఏప్రిల్ 25న సుప్రీం కోర్టు దేశ వ్యాపితంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటికి లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాంను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023-24 ఏడాదికి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల 26 లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, స్కీం వర్కర్లకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ల నిర్వహణకు పెట్టుబ డులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్‌వాడీలను నెట్టివేశారని చెప్పారు. పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్ చిత్తా ప్రతాప్‌రెడ్డి అంగన్‌వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులోని హనుమాయమ్మ రాజకీయ కక్షలతో నిర్ధాక్షిణ్యంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మట్టిఖర్చులకు ఇచ్చే దిక్కులేదని పేర్కొన్నారు. స్కీం వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 36 గంటల నిరసనలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 14 డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నారు. దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్. సుబ్బమ్మ, నాయకులు రామమోహన్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సత్యం, పాపిరెడ్డి, అంగన్‌వాడీ కోశాధికారి అంజనాదేవి, ప్రాజెక్టు నాయకులు భాగ్య, మేరి, కళావతి, సుబ్బలక్ష్మి, సుభాషిని, వసుంధర, విజయ, నాగలక్ష్మి, భారతి, అంజనమ్మ, ప్రమీళ, హుసేన్న, జయద్రం, కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సిఎం నగర పర్యటన నేపథ్యంలో సిఐటియు జిల్లా ప్రధాన మనోహర్, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మిదేవిని అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

నామినేటెడ్ పోస్టులకు సీనియర్ల ఆశలు

సిఎం జగన్‌కు వినతుల వెల్లువ

చూద్దామంటూ సిఎం దాటవేత ధోరణి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికార పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కోర్కెల చిట్టాలతో చుట్టుముట్టారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, కడప ప్రాంతాల్లోని తన మూడ్రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజు కడపలో పర్యటించారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, రాజీవ్‌మార్గ్, రాజీవ్‌పార్క్ ప్రాంతాల్లో 20 మంది చొప్పున వినతిపత్రాలు, విజ్ఞప్తులతో క్యూ కట్టినట్లు సమాచారం. సీనియర్ నాయకులుగా పేరు కలిగిన కొందరు నేతలు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. వీరిలో ఓ కార్పొరేటర్ తమ ఆర్య వైశ్య సామాజికవర్గ కోటా కింద టిటిడిలో నామినేటెడ్ పోస్టు కోరినట్లు తెలిసింది. మరో సీనియర్ నాయకుడు ఏదో ఒక నామినేటెడ్ పోస్టు కేటాయించాలని కోరడం గమనార్హం. అనంతరం రాజీవ్ మార్గ్ దగ్గర కొంతమంది కార్పొరేటర్లు తమ వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన వినతిపత్రాలను అందించినట్లు తెలుస్తోంది. వీరిలో అత్యధికంగా ఫైనాన్షియల్ భరోసా నిమిత్తం ఆర్థిక పరమైన అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిసింది. మూడవ గ్రూపు రాజీవ్‌పార్క్ దగ్గర సిఎంను కలిసిన సందర్భంలో నగర అభివృద్ధికి సంబందించిన బుగ్గవంక రహదారి పనులు, డ్రెయినేజీ పనుల్ని సకాలంలో పూర్తి చేయించాలని కోరినట్లు సమాచారం. మరికొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఎంఎల్ఎ, మేయర్, ఎంపీల సహాయంతోనే నామినేటెడ్ పోస్టులు రావడం తథ్యమనే ఉద్దేశంతో ఎటువంటి కోర్కెలను కోరలేదని తెలిసింది. ఏమైనా ఉంటే ఎంఎల్ఎ, మేయర్, ఎంపీల ద్వారానే సాధించుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో విజయావకాశాలు ఎలా ఉంటాయో తెలియదనే ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా తమ కోర్కెల చిట్టాలను విప్పినట్లు తెలుస్తోంది. దీనికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ స్పందిస్తూ ఇంకా సమయం ఉంది కదా, చేద్దా ములేనంటూ దాటవేత ధోరణిని ప్రదర్శించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జిల్లాలోని వైసిపి సీనియర్ నేతలు దీపం ఉండగానే ఇళ్లు చక్క బెట్టుకోవాలనే ఉద్దేశంతో పావులు కదిపినట్లు తెలుస్తోందనడంలో సందేహం లేదు.

మొదటి రోజు కౌన్సెలింగ్‌కు స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. (ఏడీసెట్-23) కమిటీ చైర్మన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, (ఏడీసెట్-23) కన్వీనర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఆచార్య సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీసెట్)- 2023కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించారు. క్యాంపస్‌లో హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం ఒక్కరోజే 60 మందిపైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. బిఎఫ్ఎలో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లయిడ్‌ఆర్ట్, శిల్పం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. ప్రవేశాల ప్రక్రియను రిజిస్ట్రార్, ఏడీ సెట్-23 కన్వీనర్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి పర్య వేక్షించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొందరు అభ్యర్థులు కొన్ని రకాల ధవీకరణ పత్రాలు తీసుకు రాకపోవడంతో వారికి కొంత సమయం ఇచ్చి వెసులుబాటు కల్పించారు. అనంతరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అధికారులు అందజేశారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ప్రవేశాల కోసం రావడం విశేషం. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, యూనివర్శిటీలో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో ఉండాలని యూనివర్శిటీ అధికారులు విద్యార్థులకు సూచించారు. ప్రక్రియలో వైవీయూ సహ ఆచార్యులు ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు, ప్రొఫెసర్ ఎ. చంద్ర శేఖర్,డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒ అవినీతి ఆరోపణలపై కలెక్టర్ విచారించాలి

కడప అర్బన్ : జిల్లా విద్యాశాఖ అధికారి తమను డబ్బులు అడిగారని, డబ్బులు ఇవ్వని కారణంగానే తమ పాఠశాల మూసివేత ఆదేశాలు ఇచ్చారని బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనపై కలెక్టర్, రాష్ట్ర పాఠశాల కమిషనర్ స్పందించి విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిపై ఒక పాఠశాల కరస్పాండెంట్ అవినీతి ఆరోపణలు చేస్తే వాటిపై విచారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారిపై వచ్చిన ఆరోపణ వాస్తవం అయితే చర్యలు తీసుకోవాలని, డిఇఒపై పై చేసిన ఆరోపణలు తప్పు అయితే ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బొజ్జ తిరుమలేష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా 8,995 దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తల కుటుంబాలకు సంబంధించిన రూ.625.19 కోట్ల రాయితీలను విడుదల చేయాలని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎపి చాప్టర్ సమన్వయ కర్త ఓబిలి శివ శంకర్ సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాత కలెక్టరేట్‌ను స్టేట్ మ్యూజియంగా తీర్చిదిద్దుతామని సిఎం హామీ ఇచ్చారని ఇంటాకన్ కన్వీనరర్ లయన్.కె.చిన్నపరెడ్డి తెలిపారు. అలాగే కడప నగరంలోని 75 సంవత్సరాల చరిత్ర కలిగిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)కు అనుబంధంగా వసతి గృహాలను పునరుద్ధరించాలని కోరారు. పత్రం అందజేశారు. ఎంతో చరిత్ర కలిగి, ఎందరో రాజకీయ దురం ధరులను, ఐఎఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధి కారులను దేశానికి అందిం చడంతోపాటు, లక్షలాదిమంది విద్యార్థులకు విద్యా ్సవలను అందించిన కళాశా లకు వసతి గృహాలు లేకపోవడం పేద విద్యా ర్థులకు ఇబ్బందికరంగా మారిం దన్నారు దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్ రెడ్డి స్పందిస్తూ ఇంత చరిత్ర కలిగిన కళాశాలకు వసతి గృహాలు లేకపోవడం ఏంటని... వెంటనే హాస్టల్స్ సమస్యను పరిశీలించాలని కలెక్టర్ వి. విజయ ్రామరాజును ఆదేశించారు. ఆయన స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వినతి పత్రం అందజేస్తున్న చిన్నపరెడ్డి

రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

అట్లూరు : పంటలు సాగు చేసే పేద రైతులకు వ్యవసాయ పెట్టుబడుల గాను వడ్డీ లేని రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మాధవరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరారు సోమవారం ఇడుపులపాయలు సీఎంను మాధవరెడ్డి కలిసి రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేయాలని చాలా మండలాల్లో పశుగ్రాస కొరత ఉందని వేసవిలో ఈ సమస్య మరింత జటిలంగా ఉంటుందని రైతులకు పశుగ్రాస ము అందించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు

అంబులెన్స్‌లో గాయపడిన ఎఇ పుష్పలత, కార్మికుడు లక్ష్మీనారాయణ

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరెస్టు

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ శాఖలో ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఎస్ఐ, కానిస్టేబుల్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బహిరంగ లేఖను కడప నగరంలో పర్యటించే ముఖ్యమంత్రికి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్‌ను పోలీసులు సోమవారం అడ్డగించుకొని అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంద ర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్య మంత్రి ప్రజల సమస్యలు వినకుండా నిర్బంధాలు అరెస్టులు చేయించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కలిసే అవకాశం కూడా లేకుండా పోలీసులతో ఉక్కు పాదం మోపి అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. తక్షణమే తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వాటి సాధన కోసం నిర్బంధాలను అరెస్టులను సైతం ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జుబేదా తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల అధికారులు అందరూ తమ నివేదికలు తీసుకొని సమావేశానికి హాజరు కావాలన్నారు. ఉదయం 10.30 సమావేశం ప్రారంభం అవుతుంది అన్నారు. అధికారులందరూ సకాలంలో హాజరు కావాలన్నారు.

జనసేన అధినేత దిష్టిబొమ్మ దగ్ధం

చెన్నూరు : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం చెన్నూరు పాత బస్టాండ్ వద్దనున్న సచివాలయం-2 పరిధిలోని వాలంటీర్లు ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల ంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న తమపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాద ని వారన్నారు. కార్యక్రమంలో పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వాలంటీర్లు

దాతల సహకారం మరువలేనిది : ఎంఇఒ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

దాత, నరేందర్ రెడ్డి సహకారం మరువలేనివని మండల విద్యాశాఖ అధికారులు వెంకట్రాంరెడ్డి, రమాదేవి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని స్థానిక సిఎంఆర్ పల్లె లోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ అయిన నరేందర్ రెడ్డి విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్, పెన్సిళ్లు, కాపీ రైటింగ్ బుక్, టేబుల్ బుక్స్‌ను మండల విద్యాశాఖ అధికారులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేందర్ రెడ్డి ఎనిమిది సంవత్సరాలుగా మండలంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఇలాగే దాతలు ముందుకు వచ్చి పిల్లలకు సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలిరెడ్డి, చండీప్రియ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎంఇఒలు

ఆర్‌టిపిపిలో అగ్ని ప్రమాదం

- ఎఇ పుష్పలత, కార్మికుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ఆర్‌టిపిపిలో సోమవారం షార్ట్ సర్క్యూట్ వల్ల ఎల్‌టి బ్రేకర్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆర్‌టిపిపిలోని స్టేజ్-2లో ఎల్‌టి బ్రేకర్ ప్యానల్‌లో విద్యుత్ సరఫరా రివర్స్ కావడంతో ప్యానల్ ఒక్కసారిగా పేలిపోయింది.ప్రమాదం జరిగిన సమయంలో ఎలక్ట్రికల్ మెయిం టెనెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఎఇ పుష్పలత, కాంట్రాక్ట్ కార్మికుడు లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. ఎఇ పుష్పలత ముఖం, చేతి భాగానికి, లక్ష్మీనారాయణ చేతిపై గాయాలైనట్లు అక్కడున్న కార్మికులు తెలిపారు. వారిని వెంటనే స్థానిక అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

బ్రెడ్, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని మానవత స్వచ్ఛంద సంస్థ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పులివెందుల ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు మానవత డైరెక్టరు కె.శేషమహేశ్వరి అసోసియేట్ ప్రొఫెసర్ భర్త మల్లికార్జునరెడ్డి ఆర్థిక సహకారంతో బ్రెడ్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. సేవలో ఉన్న ఆనందం మరిదేంట్లో లేదని శేషమహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, మానవత డైరెక్టర్లు, మానవత కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ఒంటిమిట్ట : ప్రముఖ వైసిపి నాయకులు గడ్డం నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి సంగటి ,పప్పు, పచ్చడి మన సాంప్రదాయం ఉంటాయని, మన పెద్దల నుంచి వస్తోందని, ఆరోగ్యానికి ఎంతో మంచి చేస్తుందని భావించి అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు కత్తి చంద్ర కిరణ్ స్వామి రామయ్య పాల్గొన్నారు.

రాగి సంగటి వడ్డిస్తున్న దాత గడ్డం నాగేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలు అందించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా ఇంత వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సాక్ష్యాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు ఇవ్వడం లేదని ప్రకటించారని అన్నారు. పాఠ్య పుస్తకాలు ఇవ్వకుంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పెట్టేవారని తెలిపారు. జగన్ విద్యకు పెద్దపీట వేశామని చెబుతూ ప్రతి ఒక్కరూ కూడా తెలుగుతోపాటు ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకోవాలని కూడా ప్రకటించారన్నారు. మూడేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా ఏ విధంగా ఆంగ్లమాధ్యమంలో చదువుకోవాలని విద్యార్థులు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వరకు టిటిడి ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పుడు అక్కడ నుంచి రాకుండా ఆపేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుభహాన్, మురళి, రాజా, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గతుకులతో ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. పట్టణంలోని గతుకుల రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నారాపుర వెంకటేశ్వర దేవస్థానం ముందు పశువుల ఆసుపత్రి ఎదురుగా రోడ్డు పూర్తిగా గతుకులతోఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు, ఇతరులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అటువైపు ప్రైవేటు పాఠశాలలు కూడా ఉన్నాయన్నారు. విద్యార్థులు, చిన్న పిల్లలు సైకిల్ మీద రావాలన్న, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాల ద్వారా రావాలన్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మధ్యనే పాఠశాల బస్సు ప్రమాదం కూడా జరిగిన సంఘటనను గుర్తు చేశారు. అధికారులు స్పందించి గతుకుల రోడ్డుకు మర మ్మత్తులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సాయి పాల్గొన్నారు.

14న అల్లాడుపల్లెలో సామూహిక కుంకుమార్చన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ కె.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రకాళి అమ్మవారికి నూతనంగా శాకాంబరీ అలంకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యతని నారాయణ పాఠశాల ఎజిఎం బి.చెన్నకేశవరాజు తెలిపారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో సోమవారం వనమహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ్ అంటే ఏమిటి వాటి ఆవశ్యకతను విద్యా ర్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటే అల వాటు చేసు కుంటూ పర్యావరణాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ ఎల్. సునీతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో పర్యావరణాన్ని కాపాడంకి.. అది మన అందరి బాధ్యత అంటూ విద్యార్థులతో మొక్కలు నాటించి, ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేస్తా

- కడప పార్లమెంట్ కమిటీ సభ్యులు కె.అరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

టిడిపి బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆ పార్టీ కడప పార్లమెంట్ కమిటీ సభ్యులు కొండారెడ్డి అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బెడుదూరు కొట్టాలపల్లెకు చెందిన అరుణ్‌కుమార్‌రెడ్డిని టిడిపి కడప పార్లమెంట్ కమిటీ సభ్యులుగా నియమించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి జిల్లా పార్లమెంట్ కార్య నిర్వహణ కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి నియామక పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌రెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తాను తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలను గుర్తించి గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి సభ్యునిగా పార్టీ అధ్యక్షులు అప్పగించారన్నారు. ఆ మేరకు జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, భూపేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పలు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సోమవారం పలు రకాల పత్రాలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సురేంద్రనాథ మాట్లాడుతూ అర్హులై ఉండి వారికి సంక్షేమ పథకాలు అందాలంటే అవి వాలంటీర్ల సమాచారం సేకరించాలన్నారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామంలో పలు రకాల సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న 122 మందికి అందజేశామన్నారు. మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, కడప పార్లమెంట్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి, సర్పంచులు పాల్గొన్నారు

క్రైం కార్నర్

శెట్టివారిపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా

- తల్లీ కుమారుడు దుర్మరణం, డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లిలో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి తల్లీకుమారుడు మృతిచెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ముక్కొండ వద్ద జగనన్న కాలనీలో ఇంటికి స్లేట్ వేసుకుని తిరిగి వస్తుండగా చెరువులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన దువ్వూరు పీరాన్ బీ (29), సాదిక్ (11) మృతి చెందారు. ట్రాక్టర్ నడుపుతున్న లక్ష్మయ్యకు గాయాలయ్యాయి. తల్లీ, కొడుకు దుర్మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బోల్తా పడిన ట్రాక్టర్



మృతి చెందిన పీరాన్ బీ, సాదిక్

ఎర్రబల్లి చెరువుకు జలకళ వచ్చేనా..!

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండల పరిధిలోని ఎర్రబల్లి చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు నింపాలని దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడే ప్రణాళికలు చేశారు. ఆయన అకాల మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టకపోవడంతో ఎర్రబల్లి చెరువు ఎత్తిపోతల పథకం కలగానే మిగిలింది. 2018లో అప్పటి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీష్‌కుమార్‌రెడ్డి చొరవతో లింగాల కుడి కాలువ నుంచి రెండు కోట్ల రూపాయలతో పైప్‌లైన్ వేసి చెరువుకు నీరు తెచ్చేందుకు ప్రయత్నించారు. మోటర్ల సామర్థ్యం తక్కువగా ఉండడంతో చెరువుకు నీళ్లు నింప లేకపోయారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.850 కోట్లతో చిత్రావతి-ఎర్రబలి ఎత్తిపోతల పనులు చేపట్టారు. రెండు టిఎంసి నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంది. ఇందులో వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని ఆరు చెరువులను నింపాల్సి ఉంది. అనంతరం వేంపల్లిలోని గిడ్డంగివారిపల్లి చెరువు నీటిని సరఫరా చేయడం ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల వల్ల యుసిఐఎల్ పరిధిలోని మబ్బుచింతలపల్లి, కెకె కొట్టాల, భూమయ్యగారిపల్లి, రాచకుంటపల్లి, మీదిపెంట్ల గ్రామాలకు సురక్షిత నీటిని అందించాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జికెఎల్ఐ సంస్థ ద్వారా పనులు ప్రారంభించారు. పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఇలాగే పనులు జరిగితే రెండేళ్లకు పైగా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత డిసెంబర్ పులివెందుల పర్యటనలో జులై నాటికి ఎర్రబల్లి చెరువుకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం అనుకున్న రీతిలో సాగడంలేదు. దీంతో అనుకున్న సమయానికి ఎర్రబల్లి చెరువుకు నీళ్ళు అందించలేకపోయారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పనుల్లో వేగవంతం పెంచితేనే వచ్చే ఏడాదికైనా నీళ్లు అందించడానికి వీలవుతుంది. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకుపోతే తప్ప ఎత్తిపోతల పథకం పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడంలేదు.

దేశమంతటా ఎగుమతి చేస్తాం : ఎమ్‌డి

సిఎంకు ఎపి కార్ల్ భవన ఫొటోను అందిస్తున్న ఎమ్‌డి డాక్టర్ ప్రతాప్ వి రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఎపి కార్ల్‌లో 10 ఎకరాల్లో రూ.25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన న్యూ టెక్ బయోసైన్స్ ఇండస్ట్రీని ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎంకు దాణాల్లో కలిపే పోషక మిశ్రమ పదార్థాల గురించి సంస్థ ఎండి డాక్టర్ ప్రతాప్ వి రెడ్డి వివరించారు. దాణాల్లో పోషక పదార్థాలను కలిపేందుకు ఇక్కడ నాణ్యమైన పోషక పదార్థాలు తయార వుతాయని, దేశవ్యాప్తంగా నెలకు వెయ్యి టన్నులు దిగుమతి చేయగలమని తెలిపారు. అలాగే ఇక్కడ తయారు చేసే పరిశ్రమ మొత్తం దేశంలోనే నాలుగు చోట్ల ఉందని, ఐదోదిగా పులివెందులలో నెలకొల్పారన్నారు. గతంలో అమెరికా, న్యూయార్క్‌లో ఉన్న పరిశ్రమల నుంచి హైదరాబాదుకు తరలించి అన్ని పౌల్ట్రీలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇక పులివెందుల నుంచి రాష్ట్రాలతోపాటు దేశాలకు కూడా దిగుమతి చేయగలమని ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా వంద మందికి పరోక్షంగా 200 మందికి ఇక్కడ ఉపాధి కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఇక్కడ సంస్థ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఇవ్వడం వల్లే ఇతర దేశాలలో తమ కంపెనీని పులివెందుల ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో నెలకొల్పామన్నారు. తనకు 15 దేశాలలో కంపెనీలు ఉన్నాయని తెలిపారు. తాను ఏదైనా నగరంలో పెట్టవచ్చునని, కానీ వ్యవసాయానికి మరింత తన సహకారం కూడా అందించాలని ఒక ఉద్దేశంతో తన తండ్రి ఊరు కమలాపురం కావడంతో ఈ జిల్లాలోనే ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు దిగమతి చేసేందుకు రోడ్డు మార్గాలు కూడా బాగున్నాయని తెలిపారు. సమీపంలోనే ముద్దనూరు రైల్వేస్టేషన్ ఉందన్నారు. ఇక్కడ తయారు చేసే పోషకాలు ఎక్కువ శాతం దాణాలో ఈ మినరల్స్‌ను కలపడం జరుగుతుందని, తద్వారా పశువులు ఆరోగ్యంతోపాటు పాలు బాగా ఇస్తాయన్నారు. దాణానే కాకుండా మినరల్స్ కూడా పంపించడం జరుగుతుందన్నారు. మినరల్స్ సంబంధించి జింక్, కాపర్ వంటివి కలిపి తయారు చేయనున్నట్లు, పాడి రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ప్రపంచ పటంలో పులివెందులను మొదటి స్థానంలో నిలిపేందుకు తమ వంతుకృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారంతో దీన్ని ఇక్కడ నెలకొల్పామన్నారు. ఇక్కడ తయారు చేసే నాణ్యమైన మినరల్స్‌పై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

శంకుస్థాపనలే తప్ప ప్రారంభోత్సవాలుండవ్ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో శంకుస్థాపనలే తప్ప ప్రారంభోత్సవాలు ఉండవని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శంకుస్థాపనలకు సిఎం జగన్ స్పెషలిస్ట్‌గా నిలిచారని ఎద్దేవా చేశారు. 2019 డిసెంబర్ 23న జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేసి మూడేళ్లల్లో ప్రారంభిస్తామని జగన్ చెప్పారన్నారు. అక్కడ పనులే మొదలు కాలేదన్నారు. 2023 ఫిబ్రవరి 15న మళ్లీ శంకుస్థాపన చేసి అయిదు నెలలవుతున్నా ఉలుకుపలుకూలేదని విమర్శించారు. 2019 డిసెంబర్ 22న రూ.564 కోట్లతో కుందు-పెన్నా ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. రూ.1,357 కోట్లతో రాజోలి జలాశయానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నారు. జొలదరాశి శంకుస్థాపన చేశారని తెలిపారు. కొప్పర్తి శ్రామికవాడలో ప్రచారమే తప్ప పరిశ్రమలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.55 కోట్లతో దేవుని కడప చెరువు అభివృద్ధికి పనులు మొదలే కాలేదన్నారు. రూ.30 కోట్లతో బుంగవంక సుందరీకరణ పనులు ఆగిపోయాయన్నారు. 2021లో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 42 మంది చనిపోయారని, నిర్వాసితులకు ఇప్పటకీ పునరావాసం కల్పించికపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణ పనులు మూడేళ్ల అవుతున్నా పూర్తి కాలేదని విమర్శించారు. కడపలోని సిపి బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. పుల్లన్న పులివెందుల సంతకు పోనూ పోయాడు.. రానూ వచ్చాడు కాని ఒట్టి చేతులతో వచ్చాడు అనే సామెతలా సిఎం జగన్ వాలకం ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లోపు శంకుస్థాపనలు చేసిన పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయాలని సిఎంకు తులసిరెడ్డి సూచించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని, రాబోయే వర్షాకాలంలో గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.అయేషా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు వైద్యులు, సూపర్‌వైజర్స్, సిబ్బంది, ఆశా కార్యకర్తలకు తగు సూచనలిచ్చారు. పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వైద్యాధికారి వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, జిల్లా విస్తరణ అధికారులు, కెఎస్ వి ప్రసాద్, యంవివి. ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, ఆశా నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, కృష్ణప్రియ, సిహెచ్ఒలు, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

రక్త హీనత లేకుండా చూసుకోవాలి

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్‌కె కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు పరీక్షలు చేశారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వల్లి మాట్లాడుతూ గర్భిణులు రక్త హీనత సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాన్పు అయిన వెంటనే బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం పొందాలని సూచించారు. టీకాలు వేయించుకోవాలని తల్లులకు సలహా ఇచ్చారు. మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సురక్షితంగా తల్లులను ఇంటికి చేర్చుతామన్నారు. గర్భిణులకు ఖాదర్‌పల్లెకు చెందిన ఎన్ఆర్ఐ తొట్టి అబ్దుల్ కరీం దంపతులు భోజన ఏర్పాటు కల్పించారు. అబ్దుల్ కరీం దంపతులను ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులేష్, డాక్టర్ కావ్య మాధురి, సిహెచ్ఒ మహదేవ్ యాదవ్, సూపర్వైజర్ సరస్వతి, ఎఫ్‌పిఎస్ పర్యేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న దాతలు

'యువ ఉత్సవ్'లో పాల్గొనండి

రాయచోటి : జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కడప , అన్నమయ్య నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ , రాయచోటిలో నిర్వహిస్తామన్నారు. ఈ యువ ఉత్సవ్‌లో (పంచ్ ప్రాణ్ అఫ్ అమ్రిత్ కాల్) అనే అంశం పై పెయింటింగ్ , కవితవ్యం / వ్యాస రచన, మొబైల్ ఫొటోగ్రఫీ ,డిక్లేమసిన్ (ఉపన్యాస) ,విభాగాలలో వ్యక్తిగత పోటీలు , కల్చరల్ (గ్రూప్) పోటీలు ఉంటాయిన్నారు. యువ ఉత్సవ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి https://forms.gle/ LAPzKTf3VuydP9kను ఉపయోగించు కోవాలన్నారు. త్వరలో నిర్వహణ తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయండి

రాయచోటి టౌన్ : దళిత కుటుంబానికి న్యాయ్యం చేయాలని ఎపి దళిత మిత్ర సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కె కిషోర్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని కురబల కోట మండలం తెట్టు గ్రామం పెద్ద దళిత వాడకు చెందిన చుక్క హరినాథ్ మరణించి 4 నెలలు కావస్తున్నా న్యాయం జరగలేదని తెలిపారు. శరీరం పై రక్తపు గాయాలు ఉంటే పోస్టుమార్టం రిపోర్టు తారు మారు చేసి ఎలాంటి గాయాలు లేవని డాక్టర్లు నిర్ధారించారని అన్నారు. చుక్క హరినాథ్ మృతదేహానికి అధికారులు మళ్లీ పోస్టుమార్టం నిర్వహించి దళిత కుటుంబానికి నాయం చేయాలని కోరారు.

అనుమతి ఉత్పత్తులనే విక్రయించాలి

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎడిఎ, ఎఒ

ముద్దనూరు : ప్రభుత్వం అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే రైతులకు విక్రయించాలని భూ సంరక్షణ విభాగం పర్యవేక్షణ ఎడిఎ అనిత దుకాణ దారులకు సూచించారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఎడిఎ, ఎఒ వెంకటకృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను విక్రయించాలన్నారు. అనుమతిలేని వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కాలపరిమితి, ఎరువులకు సంబంధించి ఫారం ఓ, విత్తనాలకు సంబంధించి ఫారం సి, పురుగుమందులకు సంబంధించి పిసి తనిఖీ చేశారు. బిల్లు పుస్తకాలను, రికార్డులను సక్రమంగా రాసి ఉంచుకోవాలన్నారు. ఉప్పలూరు గ్రామంలోని పురుగు మందుల దుకాణాల్లో పత్రాలు సరిగా లేని వాటిని గుర్తించి రూ.46వేలు విలువ కలిగిన పురుగుమందులు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ముద్దనూరులో ఎరువులకు సంబంధించి రూ.లక్ష 6వేలు విలువ కలిగిన ఉత్పత్తులకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

నియోజకవర్గ పరిధిలో 20 వేల ఓట్లు చీలుస్తా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో రాజకీయంగా పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఇటీవల పలువురు వైసిపి నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబివుల్లా, 22వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ మంగళగిరిలో చంద్రబాబు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇది కాస్త నియోజకవర్గంలో పలు రాజకీయ చర్చలకు తావి స్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ తన నివా సంలో విలేకరులతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఖచ్చితంగా ఇరవై వేల పైచిలుకు ఓట్లను వైసిపికి దూరం చేసి టిడిపి ఖాతాలో జమ చేస్తామన్నారు. అలా కాని నేపథ్యంలో తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని బహిరంగ ప్రకటన చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రొద్దుటూరులో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. 2019 మున్సిపల్ ఎన్నికల సమయంలో తాము తమ కుటుంబ సభ్యులు పార్టీ కోసం అహర్నిశలు పని చేసి అభ్యర్థులను ఏకగ్రీవం చేయటంలో కృషి చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబివుల్లా, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పాఠశాల, కళాశాల భవనాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కొండాపురం

పాఠశాల, కళాశాల భవనాలు త్వరగా పూర్తి చేయాలని ఆర్ఎస్ఒ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఒ) రాష్ట్ర అధ్యక్షులు జగన్ మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలు గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురై నాలుగేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకూ పాఠశాల, కళాశాలకు కొత్త భవనాలు నిర్మించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పాఠశాల, కళాశాల వెనుకనే నీరు ఉండడంతో విషపూరిత పురుగులు సంచరిస్తున్నాయన్నారు. వర్షాకాలం వస్తే విద్యార్థులు రైల్వే వంతెన కింద నీరు నిలబడడంతో దాటుకొని రావాలంటే విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. జూనియర్ కళాశాల కూడా మునకలో ఉన్నందున ఇప్పటికీ ఒక్క అడ్మిషన్ కూడా రాలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి భవనాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులను న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఒ నాయకులు రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఎస్ఒ నాయకులు జగన్

జిఒ 25ను అమలు చేయాలి

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు

చైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ 25ను అమలు చేయాలని మున్సిపల్ కార్మిక సంఘ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ కోరారు. ఆ మేరకు సోమ వారం మున్సిపల్ కమి షనర్, ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షలు, సాధారణంగా చనిపోతే రూ.2లక్షలు మంజూరు చేయాలని జిఒలో ఉందన్నారు. కార్మికులు ఇదివరకే మరణించారని, వారి కుటుంబ సభ్యులకు ఆ జిఒ వర్తింపజేయాలన్నారు. కార్మికులకు వ్యక్తిగత రుణం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, రమాదేవి, అన్నపూర్ణ, రవి పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

స్పర్శలేని మచ్చలపై అవగాహన అవసరమని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదరవల్లి సూచించారు. సోమవారం స్థానిక పిహెచ్‌సిలో లెప్రసీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్టు వ్యాధికి సంబంధించిన రాగి రంగు మచ్చలు, స్పర్శ లేని మచ్చలు ఎవరికి ఉన్నా అధికారులకు తెలియజేయాలన్నారు. కుష్టు వ్యాధి నివారణలో భాగంగా గ్రామాల్లో సర్వే చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, సూపర్వైజర్ సరస్వతి, సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - వేంపల్లె

వాలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను వాలంటీర్లు సోమవారం దగ్ధం చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. వాలంటీర్ వ్యవస్థను కించపర్చేలా పవన్‌కళ్యాణ్ మాట్లాడడం శోచనీయమన్నారు. పవన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 6వ గ్రామ సచి వాలయం కన్వీనర్ నాగేష్, 5వ సచివాలయం కన్వీనర్ బ్రహ్మ, వాలంటీర్లు రవి, గౌస్ బాషా, సుబ్బయ్య, మౌలాలి, మునికుమార్, జగదీష్, శ్రీను, మహిళా వాలంటర్లు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ఏలూరులో సభలో పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వాలంటీర్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం పాత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద వాలంటరీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా దృక్పథంతో తాము పని చేస్తున్నామని, తమపై లేనిపోని ఆరోపణలు చేయడం, మహిళలను ట్రాప్ చేస్తున్నామని, మహిళల విషయాలను కుటుంబ వివరాలను వైసిపి నాయకులకు అందజేస్తున్నామని అనడం సరికాదన్నారు. తాము కరోనా సమయంలో సొంత మనుషుల కంటే ఎక్కువగా కష్టపడి పని చేశామన్నారు. పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

రాయచోటి యువకుడికి అరుదైన గౌరవం

రాయచోటి : ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు పొందిన రాయచోటికి చెందిన యువకుడు వినయ్ కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తాను చేసిన సేవలకు గాను పంచరామలింగేశ్వర పురస్కారం ఉత్తమ సేవ పురస్కారాన్ని భీమవరంలోని సోమరామ ఆలయంలో వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతిక సంస్థ వారి అధ్వర్యంలో ప్రముఖులు కళారత్న భారతి, ప్రపంచ కూచిపూడి డే సృష్టికర్త డాక్టర్ భావన, ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఘంటసాల పవన్ కుమార్, ఆలయ ఇఒ సురేష్ నాయుడు , యువ నాయకుడు రవితేజ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. తను విద్యార్థి దశ నుంచే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాని చెప్పారు. ఐదేళ్లుగా రక్తదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంప్‌లు, అన్న దానం, విద్యార్థులకు ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు, కంటి పరీక్షలు, విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు , యువతకు అవగాహన సదస్సులు నిర్వహించడం వంటి విస్తృత స్థాయి సేవ కార్యక్రమాలు చేశానన్నారు. సేవలకు గుర్తింపుగా పురస్కారాలు అందుకోవడం పట్ల వినయ్ కుమార్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

నేడు సుండుపల్లెకు ఎమ్మెల్యే రాక

సుండుపల్లె : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకంలో భాగంగా మంగళవారం సుండుపల్లెకు రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి రానున్నట్లు రాయవరం సర్పంచ్ మహమ్మద్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దినేని కాలువ , సుండుపల్లె పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.